సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 4 । మే । 2025

I

నీ కడుపు సల్లగుండా

సండే స్పెషల్

వేసవి తాపం నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు వెలిశాయి. కొందరు కుటుంబీకుల జ్ఞాపకార్థం.. మరికొందరు సేవా దృక్పథంతో సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. వేసవి ముగిసేవరకు ప్రజలకు మినరల్ వాటర్ అందజేస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

వివరాలు IIలో



న్యూస్‌రీల్

లేబర్ కోడ్ తెస్తే తిరుగుబాటు తప్పదు

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

పటాన్‌చెరు టౌన్: లేబర్ కోడ్ తీసుకొస్తే తిరుగుబాటు తప్పదని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య హెచ్చరించారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రామిక భవన్‌లో జరిగిన పార్లే ఆగ్రో పరిశ్రమ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను స్ఫూర్తిగా తీసుకొని కార్మికులు రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు వస్తే బానిసలుగా మారడం తప్పదన్నారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, రాజశేఖర్ సుజిత్, సుధాకర్, శ్రీకాంత్, కిరణ్, రాములు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారం మాతోనే సాధ్యం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. శనివారం ఐఎన్‌టీయూసీ 78వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఐఎన్‌టీయూసీ మూడు కోట్ల 30 లక్షల మంది కార్మికులు సభ్యత్వం ఉన్న అతిపెద్ద కార్మిక సంఘమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక పక్షపాతి అని, వారికి కార్మిక వర్గం అండగా ఉంటుందన్నారు. కార్మిక నాయకులు విజయ్, రాజశేఖర్ రెడ్డి, కుమార్, ప్రదీప్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

అధిక సాంద్రతతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్

ఝరాసంగం(జహీరాబాద్): అధిక సాంద్రత విధానంతో పంటలు అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగం రైతు వేదికలో అరణ్య అగ్రికల్చర్ ఆల్టర్నేటివ్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు పత్తి సాగులో తాజా మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో ఎక్కువ విత్తనాలు వేసి తక్కువ దూరంతో సాగు చేస్తే దిగుబడి బాగా వస్తుందన్నారు. బయోచార్ ఎరువులో అధిక పోషకాలు నీటిని నిలిపే సామర్థ్యం పెంచుతుందన్నారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్, అరణ్య సంస్థ ప్రతినిధి పద్మ, నూజివీడు సీడ్స్ ప్రతినిధి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



ఖైదీలకు వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: జైలులోని ఖైదీలకు సరైన వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. శనివారం కందిలోని సెంట్రల్ జైలును ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖైదీలకు సరైన వసతులు కల్పించాలని, సమయానికి బెయిల్, ములాఖత్ అందించాలన్నారు. ఖైదీల కోసం కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. అనంతరం జైలు అధికారులతో, ఖైదీలతో మాట్లాడారు. జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు.

రైతు ముంగిట శాస్త్రవేత్త

రేపటి నుంచి శ్రీకారం

- పంట దిగుబడులు పెంచేందుకే..
- 42 రోజుల పాటు అవగాహన సదస్సులు



పంటల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): పంటల సాగుపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఆశించిన దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దుక్కులు దున్నే దగ్గర నుంచి పంట చేతికందే వరకు రైతులు చెమటోడుస్తున్నా ఆశించిన మేర దిగుబడులు రావడం లేదు. దుక్కులు సరిగ్గా దున్నకపోవడం, పంట మార్పిడి చేయక పోవడం, రసాయనిక ఎరువులు అధికంగా వాడడం, చీడ పీడల నివారణకు విపరీతంగా పురుగు మందులు వాడడం వల్ల నేల దెబ్బతినడం తదితర కారణాల వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

5 నుంచి జూన్ 16వ వరకు సదస్సులు

జిల్లాలో పంటల సాగు విధానాలపై ఈ నెల 5వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో 42 రోజుల పాటు అవగాహన కార్యక్రమాల్లో 24 బృందాలు పాల్గొననున్నాయి. ఈ బృందాల్లో వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ పనిముట్ల శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలను ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. వీరంతా గ్రామాల్లో పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించనున్నారు.

మంచి కార్యక్రమం



మా వద్దకు శాస్త్రవేత్తలు వచ్చి పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించడం మంచి కార్యక్రమం. సాగులో సరైన విధానాలు పాటించకపోవడం వల్ల సరైన దిగుబడులు రావడం లేదు. వారు చెప్పిన అన్ని సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకుంటాం.

మహేష్, రైతు–హద్నూర్

ఆరు అంశాలపై అవగాహన

రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో ఆరు అంశాలపై బృందాలు అవగాహన కల్పించనున్నాయి. అందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవడం, చీడ పీడల నివారణ కోసం వినియోగించే రసాయనిక మందుల వినియోగాన్ని తగ్గించి నేల దెబ్బతినకుండా చూడటం, ఎరువులు విత్తనాలు కొంటే దానికి సంబంధించిన రశీదును భద్ర పరుచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, పంటల సాగులో నీటి వృథాను అరికట్టడం, వేసిన పంటలే మళ్లీ మళ్లీ వేయకుండా పంట మార్పిడి చేసి మంచి ఆదాయాన్ని పొందడం, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడడం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్నారు.

దిగుబడులు పెంచేందుకే..



పంటలు వేసినప్పటి నుంచి చేతికి వచ్చే వరకు రైతులు సాగులో సరైన పద్ధతులు పాటించకపోవడం వల్ల సరైన దిగుబడులు రావడం లేదు. దుక్కులు సరిగ్గా దున్నకపోడం, రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూసారం పాడైపోవడం, మోతాదుకు మించి పురుగు మందులు పిచికారి చేయడం, అధిక శాతం నీరు వృథా చేయడం వల్ల సరైన దిగుబడులు రావడం లేదు. ప్రభుత్వం సూచించిన ఆరు అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం.

డాక్టర్ విజయ్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త

కాంగ్రెస్‌లో 'మార్కెట్' రగడ

- ఎటూ తేలని ఖేడ్, పటాన్‌చెరు ఏఎంసీల పాలకవర్గాలు నియామకం
- నేతల మధ్య ఆధిపత్య పోరు కారణమంటున్న పార్టీ వర్గాలు
- పీసీసీ వద్దకు పటాన్‌చెరు 'మార్కెట్' పంచాయితీ
- ఎంపీ, ఎమ్మెల్యేలు చర్చించుకుంటేనే 'ఖేడ్' కమిటీపై స్పష్టత
- సర్కారు వచ్చి 16 నెలలైనా తేలని పంచాయితీ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అధికార కాంగ్రెస్ పార్టీలో మార్కెట్ కమిటీల పాలకవర్గాల రగడ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకాలు జరిగినప్పటికీ నారాయణఖేడ్, పటాన్‌చెరు మార్కెట్ కమిటీల పాలకవర్గం ఖరారు కావడం లేదు. ఆయా నియోజకవర్గాల్లో నేతల మధ్య ఆధిపత్య పోరు కారణంగా ఈ పాలకవర్గాలు ఎటూ తేలడం లేదనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం ఎనిమిది మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, వట్‌పల్లి, జోగిపేట, రాయ్‌కోడ్ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు నియామకం జరిగి ఆరు నెలలు గడుస్తోంది. కానీ, నారాయణఖేడ్, పటాన్‌చెరు కమిటీల పంచాయితీ మాత్రం ఎటూ తేలడం లేదు.

గూడెం ప్రతిపాదించి రెండు నెలలైనా..

పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యుల పదవులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొందరు నాయకుల పేర్లను ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రతిపాదిత లేఖను ఫిబ్రవరిలోనే అధికారులకు అందజేశారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న కాటా శ్రీనివాస్‌గౌడ్ అభ్యంతరం తెలపడంతో గూడెం ప్రతిపాదనలకు బ్రేక్ పడింది. రెండు నెలలుగా ఈ పంచాయితీ ఎటూ తేలడం లేదు. ఈ చైర్మన్, సభ్యుల పదవులను తన వర్గీయులకు ఇచ్చేందుకు గూడెం మహిపాల్‌రెడ్డి ప్రతిపాదించగా, కాటా శ్రీనివాస్‌గౌడ్ తన అనుచరులకు ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో గత ఆరు నెలలుగా ఈ పదవులు భర్తీ కావడం లేదు.

పీసీసీకి మార్కెట్ కమిటీ పంచాయితీ

పటాన్‌చెరు మార్కెట్ కమిటీ నియామకాల క్లిష్టంగా మారడంతో ఈ పంచాయితీ పీసీసీ వద్దకు వెళ్లింది. ముఖ్యనేతలే ఈ పంచాయితీని తేల్చాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగానే ఆరు నెలలుగా ఈ పదవులు భర్తీ కావడం లేదని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

'ఖేడ్'లో సమన్వయం కుదిరితేనే..

నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవులను కూడా తమ అనుచరులకు ఇప్పించుకునేందుకు అక్కడి ఇద్దరు నేతలు పట్టుబడుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తన అనుచరులకు ఈ పదవిని ఇప్పించుకునేందుకు ప్రయత్నించగా, స్థానికంగా ఉండే జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ కూడా తన వర్గీయులకు ఇవ్వాలని అడుగుతున్నారు. దీంతో ఈ మార్కెట్ పంచాయితీ కూడా ఇంకా ఎటూ తేలడం లేదు. ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కుదిరితేనే ఈ పదవులు తేలే అవకాశాలు ఉన్నట్లు హస్తం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

గతంలో జహీరాబాద్‌లోనూ లొల్లే..

జహీరాబాద్ మార్కెట్ కమిటీ నియామకం గతంలోనే పూర్తయిన విషయం విదితమే. ఈ కమిటీ చైర్మన్ పదవిని అక్కడి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మాజీ మంత్రి చంద్రశేఖర్ తన కుమారుడిని నియమించుకున్నారు. దీనిపై స్థానిక కాంగ్రెస్ నేతలు అప్పట్లో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం వచ్చాక పదవులు దక్కుతాయనుకుంటే తమకు నిరాశే ఎదురైందని స్థానిక సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఒక టర్మే దగ్గర పడుతుండే...

ఆయా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవుల్లో ఈ మార్కెట్ చైర్మన్లు, సభ్యుల పోస్టులు ముఖ్యమైనవి. సాధారణంగా ఈ పోస్టుల పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి 16 నెలలు గడుస్తోంది. కానీ ఇప్పటి వరకు నారాయణఖేడ్, పటాన్‌చెరు మార్కెట్ కమిటీల పోస్టులు ఎటూ తేలకపోవడంతో ఆ పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే ఈ పదవులను నియమించి ఉంటే ఒక టర్మే దగ్గర పడేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీట్ పరీక్షకు సర్వం సిద్ధం

- హాజరు కానున్న 3,320 మంది అభ్యర్థులు
- కలెక్టర్ క్రాంతి వెల్లడి



సంగారెడ్డి జోన్: నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ క్రాంతి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్ష జరగనుందని చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,320 మంది పరీక్షకు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి కనీసం అరగంట ముందే లోనికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష హాలులోకి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు ఉంటాయన్నారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో మూడు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు ఇతర సమస్యలపై కూడా ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ అశోక్ పాల్గొన్నారు.

లంపిస్కిన్ కలకలం

జీర్లపల్లిలో లేగదూడ మృతి



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): పశువుల్లో ప్రాణాంతక వ్యాధి లంపిస్కిన్ మండలంలో కలకలం రేపింది. జీర్లపల్లిలో శుక్రవారం రాత్రి లేగదూడ మృతి చెందింది. వివరాల ఇలా.. గ్రామానికి చెందిన శ్రీశైలం తన లేగదూడ శరీరంపై దద్దుర్లు, మెడ కింది వాపు, కాళ్ళువాపు లక్షణాలు కనిపించడంతో పశువైద్యులను సంప్రదించారు. చికిత్స ప్రారంభించడంతో దూడ మృతి చెందింది. దీంతో గ్రామంలోని పశుపోషకులు ఆందోళనకు గురవుతున్నారు. మృతి చెందిన పోషకుడి వద్ద ఉన్న మరో దానికి లక్షణాలు ఉన్నాయని తెలిపారు. దీంతో పశువైద్య శాఖ అధికారులు అప్రమత్తమై గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి తెల్లజాతి పశువులకు టీకాలు వేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశం

సంగారెడ్డి జోన్: ఆన్‌లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, మోసాలు, డ్రగ్ దుర్వినియోగం, ట్రాఫిక్ రూల్స్‌పై జిల్లా ప్రజలలకు, విద్యాసంస్థలలో అవగాహన కల్పించి, ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. శనివారం జిల్లా తన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు పేరుతో ఆన్‌లైన్‌లో వీడియో కాల్స్ చేసి, పోలీసు అధికారులం అంటే నమ్మరాదని, ఏ పోలీసు అధికారులు వీడియో కాల్స్ చేయరని స్పష్టం చేశారు. డిజిటల్ అరెస్టులు ఉండవు, ఫిజికల్ అరెస్టు మాత్రమే ఉంటుందన్నారు. వాణిజ్య పరంగా 20 కిలోల బరువు కలిగిన గంజాయిని అక్రమ రవాణా చేసిన స్మగ్లర్ల ఆస్తులను కోర్టుకు అటాచ్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లు గా గుర్తించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు చేస్తూ, మద్యం తాగి వాహనాలను నడిపే వాహన దారీలపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు సత్యయ్య గౌడ్, రవీందర్ రెడ్డి, రామ్‌మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో సమస్యలు ఉండొద్దు

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి: మహిళా డిగ్రీ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో అదనపు వసతి గదులతో పాటు మూడు వందల మంది విద్యార్థినులకు సరిపోయేలా కిచెన్, డైనింగ్ గదులు మూడు అంతస్తుల్లో ఏర్పాటు అయ్యేలా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ దృష్ట్యా మినీ ఆడిటోరియం, హాస్టల్ భవనం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ప్రాథమిక పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో కావాల్సిన అన్ని మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలని కోరారు. ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డీఈ రాజు, ఏఈలు రాజ మల్లయ్య, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- త్వరలో రెండు రిజర్వాయర్లు ప్రారంభం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



రిజర్వాయర్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/రామచంద్రాపురం(పటాన్‌చెరు): అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము కృష్ణ బృందావన్ కాలనీలో 20 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన నూతన రిజర్వాయర్‌ను, అలాగే.. ఉస్మాన్‌నగర్‌లో భగీరథ తాగునీటి రిజర్వాయర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన కాలనీలకు సైతం తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలోనే బంధంకొమ్ములో రూ.10 కోట్లతో ఎనిమిది కిలోమీటర్ల పైపులైన్ సామర్థ్యంతో 30 వేల మంది జనాభాకు మంచి నీటిన అందించేందుకు రిజర్వాయర్ నిర్మించామని చెప్పారు. అలాగే.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.30కోట్లతో రిజర్వాయర్‌ను నిర్మించామని, త్వరలో 55 కాలనీలకు సురక్షితమైన తాగునీటి అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రెండు రిజర్వాయర్లను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, డీఈఎం చంద్రశేఖర్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ ఇంజినీర్ తొలగింపు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీలో ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్‌గా పని చేస్తున్న దిలీప్‌రెడ్డిని తొలగిస్తూ మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ సిద్దిపేట, గ్రీన్ సిద్దిపేట లక్ష్యంగా ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మున్సిపాలిటీలో పర్యావరణ ఇంజినీర్‌గా దిలీప్ రెడ్డి నియామకం అయ్యారు. కొంతకాలంగా విధులపట్ల నిర్లక్ష్యం, పలు ఆరోపణలు, కౌన్సిల్ తీర్మానం నేపథ్యంలో అతడిని తొలగిస్తూ, అందుకు సంబంధించి సురక్ష ఏజెన్సీతో చేసుకున్న దిలీప్ నియామకం రద్దు చేస్తున్నట్టు వారికి లేఖ రాశారు.

మట్టి టిప్పర్లు పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు, రూ.15 వేలు జరిమానా

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ వాహనాలను వట్‌పల్లి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి గుట్టుగా వట్‌పల్లి గ్రామ శివారులో నుంచి కొందరు టిప్పర్ వాహనాల ద్వారా రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఫంక్షన్ హాలు నిర్మాణం కోసం మట్టిని తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు వట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్ వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు సమాచారం అందించి వారి సమక్షంలో వాహనాలకు ఒక్కొక్కదానికి రూ.5 వేల చొప్పున మూడింటికి రూ.15 వేలు జరిమానాలు విధించారు. టిప్పర్ వాహనాల డ్రైవర్లు జాన్సన్, మహ్మద్ మోసిన్, జీ.మల్లేశం పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

రెండు నెలల కిందటే వివాహం



యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

చిన్నశంకరంపేట(మెదక్): వివాహమైన రెండు నెలలకే యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వట్టెపు రాజయ్య కుమారుడు మహేశ్‌కు రెండు నెలల కిందట వెల్దుర్తి మండలం షేరిలా గ్రామానికి చెందిన పూజను ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలోనే యువతి అత్తింట్లో ఉ రేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు యువతి తల్లితండ్రులకు సమాచారం అందించారు. ఆగ్రహానికి గురైన యువతి బంధువులు అత్తింటిపై దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొంది. అత్తింటి కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నారు. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్, రామాయంపేట సీఐ వెంకటరాజం గౌడ్ తమ సిబ్బందితో వచ్చి యువతి బంధువులను సముదాయించారు. అనంతరం మృతదేహాన్ని పరిశీలించారు.

నీ కడుపు సల్లగుండా..

- మండు వేసవిలో ప్రజల దాహాన్ని తీరుస్తున్న నిర్వాహకులు
- బస్టాండ్‌లు, రోడ్లు, ప్రధాన చౌరస్తాలు, రైతు బజార్లు, తదితర చోట్ల ఏర్పాటు
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చాలా ఏళ్లుగా నిర్వహణ
- కుటుంబీకుల జ్ఞాపకార్థం, ప్రజాసేవకై మరికొందరు
- రూ.లక్షలు ఖర్చు పెట్టి మినరల్ వాటర్ అందజేత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలు



మానవ సేవయే మాధవ సేవ అన్నారు పెద్దలు. మనిషి తన సంపాదనలో కొంతైనా మానవ సేవకు ఖర్చు పెడితే.. ఇంతకంటే గొప్ప సంతృప్తి ఏముంటుంది. అన్నదానం, నేత్రదానం, అవయదానం, నీటిదానం ఇలా అనేక రూపాల్లో ప్రజలకు సేవ చేస్తారు. వేసవి కాలం వచ్చిందంటే చాలు అనేక మంది నీటి దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. వివిధ అవసరాల కోసం బయటకు వచ్చే సామాన్య ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆస్పత్రులు, బస్టాండ్లు, రైతు బజార్లు, మార్కెట్లు, పాఠశాలల, షాపులు తదితర ప్రాంతాల్లో తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో తమ కుటుంబీకుల జ్ఞాపకార్థం ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇలా చాలా ఏళ్ల నుంచి ప్రజల దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

రోజూ 300 నుంచి 350 లీటర్లు

దుబ్బాకలో సివిల్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం



ఎర్రగుంట ప్రసాద్

దుబ్బాక: పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో సివిల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీయేటా వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. ప్రతిరోజూ 300 నుంచి 350 లీటర్ల చల్లని మినరల్ వాటర్‌ను అందిస్తూ 1,000 నుంచి 1,200 మందికి నీటిని అందిస్తున్నామని సివిల్ క్లబ్ అధ్యక్షుడు ఎర్రగుంట ప్రసాద్ సాక్షికి తెలిపారు. తమ వంతుగా సమాజానికి ఏదైనా చేయాలన్న సంకల్పంతో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీరు అందిస్తున్నామన్నారు. తమ క్లబ్ సభ్యులు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సైతం దీనికి ప్రత్యేకంగా సహకరిస్తున్నారని తెలిపారు.



తెలంగాణతల్లి చౌరస్తాలో సివిల్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఆరేళ్లుగా బస్టాండ్ వద్ద ఏర్పాటు

సీఐటీయూ ఆధ్వర్యంలో చలివేంద్రం



గొడ్డుబర్ల భాస్కర్

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అంబలి కేంద్రం తోపాటు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల భాస్కర్ ప్రత్యేక కృషితో మార్చిలో బస్టాండ్ వద్ద చలి వేంద్రంను ఏర్పాటు చేసి ప్రతి రోజూ వెయ్యిమందికి పైగా చల్లటి మినరల్ వాటర్ అందిస్తు దాహార్తి తీరుస్తున్నారు. ఆరేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా భాస్కర్ సాక్షితో తెలిపారు. మండుటెండలో ఎక్కడో సుదూరప్రాంతాలకు చెందిన వారు ఈ చలివేంద్రంలో చల్లని నీరు తాగి దాహార్తి తీర్చుకోవడం చూస్తుంటే చాలా సంతృప్తిగా అనిపిస్తుంది.



దుబ్బాకలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

మెడికల్ షాపు ఎదుట సొంత ఖర్చుతో..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి చెందిన రతన్ సరడా ఒక్కడే ఆరేళ్ల నుంచి చలి వేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని భవానీ మందిరం రోడ్డులో రద్దీ ఎక్కువగా ఉంటుంది. వేసవిలో ఈ ప్రాంతానికి వచ్చిన వారికి మంచి నీళ్లు అందించాలన్న ఉద్దేశ్యంతో తన మెడికల్ షాపు ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేసి కూలింగ్ మినరల్ వాటర్ అందిస్తున్నట్లు తెలిపారు. రెండేళ్లుగా ప్రతీ ఆదివారం నగర సంకీర్తన నిర్వహిస్తున్నామని, అందుకని ఈ సంవత్సరం చలివేంద్రాన్ని నగర సంకీర్తన పేరు పెట్టామన్నారు. పరిస్థితుల బట్టి అవసరం మేరకు కూలింగ్ వాటర్ బాటిల్స్ ఏర్పాటు చేస్తామన్నారు.



రతన్ మెడికల్ షాపు ఎదుట చలివేంద్రం




పాలమాకుల బస్టాప్‌లో చలివేంద్రం

బాటసారుల దాహార్తి తీరుస్తూ ...

నంగునూరు(సిద్దిపేట): హన్మకొండ ప్రధాన రహదారిపై ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను చూసిన వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు పాలమాకులలో 8 ఏళ్ల కిందట చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గీతా మందిర దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో నాటి నుంచి నేటి వరకు ప్రతియేటా 3 నెలల పాటు ఫిల్టర్ వాటర్ అందిస్తూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. స్థానిక బస్టాప్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బాటసారులే కాకుండా స్థానికులు, వృద్ధులు వినియోగించుకుంటున్నారు.

జేఎస్‌ఆర్ ఔదార్యం.. చలివేంద్రం

ప్రతీ నెలా రూ.15 లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు



జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి

హుస్నాబాద్: వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నాడు హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి. జేఎస్‌ఆర్ అన్న పేరిట 5 ఏళ్లుగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాడు. హుస్నాబాద్ పట్టణంతోపాటుగా అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలతోపాటుగా పెద్ద గ్రామాల్లో మొత్తం 19 చలి వేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేశాడు. ప్రతీ చలివేంద్ర కేంద్రంలో వాటర్ ఫ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజలకు కూల్ వాటర్‌ను అందిస్తున్నాడు. 24 గంటల పాటు కూల్ వాటర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. కరెంటు బిల్లు, వర్కర్లు, చలివేంద్రాల నిర్వాహణ దాదాపు ప్రతి నెలా రూ.15 లక్షలు ఖర్చు పెడుతున్నాడు.



వాటర్ ట్యాంకర్ ద్వారా చలి వేంద్రంలో నీటిని నింపుతున్న సిబ్బంది

ప్రజల దాహం తీర్చాలన్న ఉద్దేశంతోనే..

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: వేసవిలో పనుల నిమిత్తం గ్రామాల నుంచి నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌కు వచ్చే ప్రజల దాహం తీర్చాలన్న లక్ష్యంతోనే చలివేంద్రం నిర్వహిస్తున్నామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. తన భర్త దివంగత వాకిటి లక్ష్మారెడ్డి స్మారకార్థం వాకిటి లక్ష్మారెడ్డి మెమోరియల్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 20 ఏళ్ల నుంచి స్థానిక చౌరస్తాలో వేసవి సీజన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు నెలల పాటు రోజుకు సుమారు 200 నుంచి 250 లీటర్ల చల్లటి నీళ్లు అందుబాటులో ఉంచుతామన్నారు. తన భర్త స్మారకార్థం చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి పేద ప్రజల దాహం తీర్చడం సంతోషాన్నిస్తుందని తెలిపారు.



నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

18 ఏళ్లుగా డీసీఎం డ్రైవర్స్, ఓనర్స్ ఆధ్వర్యంలో..



బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా..

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా డీసీఎం డ్రైవర్స్, ఓనర్స్ ఆధ్వర్యంలో 18 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని డ్రైవర్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి తెలిపారు. ఉగాది పండుగ రోజున పచ్చడితో ప్రారంభించి మృగశిర వరకు కొనసాగిస్తామన్నారు. నిత్యం నాలుగు డ్రమ్ముల మినరల్ నీటిని (2 వేల లీటర్లు) ప్రజలు తాగుతారన్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం చాలా సంతోషంగా ఉందని, అందరం కలిసి ప్రజల కోసం ఓ మంచి పని చేస్తున్నామన్న ఆనందం కలుగుతుందన్నారు.

కుటుంబ సమస్యలతో ఉరేసుకొని ఆత్మహత్య



యాదయ్య(ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నార్సింగిలో శనివారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోడ యాదయ్య(48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో కొంత కాలంగా మద్యానికి బానిస కావడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెంది యాదయ్య ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

జహీరాబాద్‌లో యువకుడు

జహీరాబాద్ టౌన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో చోటు చేసుకుంది. శాంతినగర్‌కు చెందిన చాకలి తుకారాం(30) కుటుంబ కలహాల కారణంగా శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ.కాశీనాథ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నం

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు

వట్‌పల్లి(అందోల్): మహిళ మెడలోంచి పుస్తెలతాడును లాక్కొని బైక్‌పై పారిపోతున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన మాల నిర్మల శనివారం ఉదయం అందోల్ మండలం సంగుపేట చౌరస్తా వద్ద నాందేడ్- అకోలా జాతీయ రహదారిపై కూతురు కోసం ఎదురుచూస్తూ నిలబడింది. అదే సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై అటు వైపుగా వచ్చి మహిళను గొంతు నలిపి, కొట్టి మెడలో ఉన్న పుస్తెల తాడు తెంపుకొని పారిపోతుండగా గమనించిన స్థానికులు వెంటనే పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడు పుల్కల్ మండలం మిన్‌పూర్ గ్రామానికి చెందిన లస్కర్ సుభాష్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో ఏడుగురు అరెస్టు

వివరాలు వెల్లడించిన హుస్నాబాద్ ఏసీపీ సతీష్

చేర్యాల(సిద్దిపేట): దళిత యువకుడిపై దాడి ఘటన విషయమై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో ఏడుగురిని అరెస్టు చేసినట్లు హుస్నాబాద్ ఏసీపీ సతీష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గతనెల 29న ఎల్లాదాస్‌నగర్‌కు చెందిన ఉబిది అజయ్ మద్యం తాగి అందరిని తిడుతూ గ్రామంలోని హనుమాన్ గుడి లోపలికి వెళ్లి విగ్రహాలను పగులగొట్టి, హనుమాన్ విగ్రహాన్ని కాళ్లతో తన్నినాడు. ఈ విషయమై ఎల్లాదాస్‌నగర్ గ్రామస్తులు కట్టెలతో అజయ్‌ను కొట్టారు. అదే రోజు సాయంత్రం సుమారు 6 గంటలకు కొమురవెల్లి గ్రామంతో పాటు వేచరేణి, చేర్యాలకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి హనుమాన్ విగ్రహాన్ని ఎందుకు ధ్వంసం చేశావు అంటూ అంగీ ప్యాంటు విప్పి హనుమాన్ గుడి వద్దకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై కొమురవెల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన వారిలో శనివారం బైరి హరీశ్, పాశం భరత్‌కుమార్, ఎక్కలదేవి శ్రీనివాస్, మెరుగోజు వెంకటేశం, గౌడుగు సాయి కుమార్, ఐతరాజు ఉదయ్ ప్రకాశ్, పడకంటి వినయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు విచారణ కొనసాగుతుందని, మరి కొంత మంది నిందితులను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. ఆయన వెంట చేర్యాల సీఐ ఎల్.శ్రీను, కొమురవెల్లి ఎస్‌ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలోని పల్లె ప్రకృతి వనం చెట్ల మధ్యలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి బంధువులు ఉంటే అమీన్‌పూర్ పోలీసులను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి

ఐదుగురు యువకులపై కేసు



పోలీసులపై దాడికి పాల్పడుతున్న యువకులు

శివ్వంపేట(నర్సాపూర్): మద్యం మత్తులో యువకులు పోలీసులపై దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. శివ్వంపేట పోలీసులు తూప్రాన్- నర్సాపూర్ హైవే పై పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో శనివారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు బైక్‌లపై ఐదుగురు యువకులు హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా మద్యం మత్తులో శివ్వంపేట వైపునకు వస్తుండగా పోలీసులు ఆపారు. మా బైక్‌లనే ఆపుతారా అని ఆ యువకులు పోలీసులను దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆ యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించినప్పటికీ అక్కడ కూడా పోలీసులను దూషిస్తూ హల్‌చల్ చేశారు. పోలీసులపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు బిజ్లిపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీవాస్ లైఫ్ సైన్స్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గోమారం గ్రామానికి చెందిన ఎండీ రషీద్, గుంటూరు ప్రాంతానికి చెందిన బానావాత్ సైదానాయక్, బుక్య భీమానాయక్, గగ్లోత్ గోపినాయక్, బనావాత్ నందునాయక్ గా గుర్తించినట్లు చెప్పారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

మృతుడు యాదాద్రి జిల్లా గోపాల్‌పూర్ గ్రామ వాసిగా గుర్తింపు

ములుగు(గజ్వేల్): ములుగు మండలం బస్వాపూర్ శివారులో గుర్తు తెలియని యువకుడి హత్య మిస్టరీ వీడింది. మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దాచారం సాయి కుమార్(25)గా గుర్తించారు. మృతుడు పశువుల కాపరి అని ఇతను కానరాకుండా పోయినట్లు తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదైందని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. తుర్కపల్లిలో మిస్సింగ్ కేసు నేపథ్యంలో గ్రామానికి చెందిన వ్యక్తులే ములుగు మండలం బస్వాపూర్‌లో ఈ ఘాతుకానికి వడిగట్టారని తదుపరి విచారణ తుర్కపల్లి పోలీసులు నిర్వహిస్తారని వివరించారు.

భయంతో వంతెనపై నుంచి దూకి వ్యక్తి మృతి



అనూప్ మృతదేహం

పెద్దశంకరంపేట(మెదక్): వంతెనపై నుంచి దూకడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దశంకరంపేట పెద్ద చెరువు వంతెనపై చోటు చేసుకుంది. పేట శిక్షణా ఎస్‌ఐ అరవింద్ కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం రాంపురం గ్రామానికి చెందిన బేగరి అనూప్ (30)కు భార్య, కూతురు ఉన్నారు. అనూప్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి పెద్దశంకరంపేట నుంచి రాంపురం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అతడి ముందు బైక్‌పై చిల్వర గ్రామానికి చెందిన రాములు వెళ్తున్నాడు. వేగంగా వచ్చిన అనూప్ రాములు వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఢీకొట్టినందుకు తనను ఏమైనా అంటారేమో అని భయంతో అనూప్ వంతెన పక్కన రహదారి ఉందనుకొని చీకట్లో దూకేశాడు. ఈ క్రమంలో కిందపడిపోయి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి

చేగుంట(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలం రామంతాపూర్ శేర్ పంజాబీ దాబా సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ జిల్లా కౌడా గ్రామానికి చెందిన ప్రహల్లాద బగ్రియా(39) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. లారీని పంజాబీ దాబా వద్ద పార్కింగ్ చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపుకు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొనగా ప్రహల్లాదకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

వాహనం ఢీకొని మహిళ

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. జహీరాబాద్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన మేతరి కమలమ్మ(55) శుక్రవారం పట్టణంలోని లిక్కర్ కోర్టు సమీపంలో కాలినడకన వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు.

బైక్ ఢీకొన్న ప్రమాదంలో రైతు..



శ్రీనివాస్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్న ఘనాపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నాగం శ్రీనివాస్ (45) వరిగుంతం గ్రామ శివారులోని తన పొలం సమీపంలో గల రోడ్డు పక్కన ధాన్యాన్ని ఆరబెట్టాడు. బుధవారం సాయంత్రం ధాన్యం కుప్పల వద్ద టార్పాలిన్లను సరి చేస్తున్నాడు. ఇదే సమయంలో మెదక్ వైపు నుంచి బైక్ పై వస్తున్న ఓ వ్యక్తి శ్రీనివాస్‌ను ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, కుమారుడు ఉన్నారు.

స్నానానికి వెళ్లి యువకుడు

జిన్నారం (పటాన్‌చెరు): స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి, బాధితుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా బిక్కనూరుకు చెందిన మిరియాల శివ, అతడి తమ్ముడు ప్రసాద్ (20) రెండేళ్లుగా బొంతపల్లి గ్రామంలో చెత్తడబ్బాలు ఏరుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. 1న కటింగ్ చేయించుకుంటానని వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. శనివారం ఉదయం 8 గంటలకు గ్రామ శివారులోని అల్కా చెరువులో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు తెలిపారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా ఒడ్డున ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించారు. స్నానం చేసేందుకు బట్టలు మెట్లపై పెట్టి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని తమ్ముడి మరణంలో ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు తెలిపారు.

నకిలీ కార్డులను సృష్టిస్తున్న వ్యక్తిపై కేసు

దుబ్బాకటౌన్: కంప్యూటర్ టెక్నాలజీని ఉపయోగించి ఒరిజినల్ కార్డులను పోలిన నకిలీ ఆర్సీ, ఆధార్, పాన్ కార్డులను తయారు చేస్తున్న జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణంలోని బాలాజీ జిరాక్స్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్న సిరిమల్లె వేణుగోపాల్ సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. కార్డు దారుల అవసరాలకు అనుగుణంగా జిరాక్స్ ఆర్సీలను చిప్ గల కార్డులపై ప్రింట్ చేసి ఒరిజినల్ కార్డులను పోలిన విధంగా నకిలీ కార్డులను తయారు చేస్తున్నాడు. దీంతోపాటు పాన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు కార్డులను కంప్యూటర్, కలర్ ప్రింటర్ సహాయంతో స్కాన్ చేసి, టెక్నాలజీ ఉపయోగించి నకిలీ కార్డులను ఒరిజినల్ కార్డులుగా తయారు చేస్తున్నాడు. కార్డుదారులు మోసపూరిత చర్యలకు పాల్పడే విధంగా ప్రోత్సహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచార అందుకున్న సిద్దిపేట టాస్క్ ఫోర్స్, దుబ్బాక పోలీసులు శనివారం జిరాక్స్ సెంటర్ పై దాడి చేశారు. దుకాణంలో ఉన్న వివిధ నకిలీ కార్డులను, కంప్యూటర్, కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకొని దుబ్బాక పోలీస్ స్టేషన్ కి తరలించారు. దుబ్బాక ఏఎస్‌ఐ సముదాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరిమల్లె వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.